# చివరి రోగి

వెలుగును మింగిన చీకటి రాత్రి రూపంలో రాజ్యమేలుతుంది. చీకటినిచీల్చి చెండాడుతున్న ట్యూబులైట్ల కాంతులు నర్సింగ్ హోం నిండా తమ ప్రతాపాన్ని చూపిస్తున్నాయి.

చివరి రోగిని పరీక్షించిన డాక్టర్ విష్ణువర్థన్ బయటికొచ్చి గుండెలనిండా ఊపిరి పీల్చుకున్నాడు. తృప్తిగా సిగరెట్టు వెలిగించి వరండాలో పచార్లు చేస్తున్నాడు. చుట్టుపక్కన ఎవరూ లేరు కాబట్టి చిలిపిదనం తొంగిచూసింది. పొగరింగులు ట్యూబు లైటును చుట్టేస్తే ఎలాగుంటుందో చూడాలన్పించింది. దమ్ము గట్టిగాలాగి రింగులుగా వదిలాడు. ఫ్యాను గాలి ప్రయోగాన్ని అపజయం పాలుజేసింది. ఓటమికి తనలో తానే నవ్వుకున్నాడు చిన్నగా. కుర్చీలో కూచుని ఆలోచిస్తున్నాడు.

... ఈరోజు అనుభవం పాతదైనా అనుభూతి కొత్తదనాన్నిచ్చింది. ఎప్పట్లాగే ఈ రోజుగూడా అందమైన అమ్మాయిని చివరి పేషంటుగా ఎన్నుకున్నాడు. అమాయకపు కళ్ళు, చెక్కిన ముక్కుతోనున్న అందాల భరిణ టీనేజ్‌లో ఉంది.

ముడితె మాసిపోయేట్టుంది. పొద్దున్నే వచ్చింది ఆమె. మారు మాట్లాడకుండా ఆమెతో వచ్చిన మనిషితో "ఈమెను ప్రత్యేకంగా చూడలి. సాయంత్రం రండి." అని పంపించాడు. సాయంత్రం వచ్చింది. మిగతా రోగులందర్నీ చూచేదాకా ఓపిగ్గా కూచుంది. ఆమె కన్సల్టింగ్ రూంలోకి అడుగు పెట్టగానే తలుపు గడియ పడిపోయింది. అలవాటు ప్రకారం స్టాఫంతా మాయమయ్యారు. అవిడ అదాల్ని పరిక్షించడం చకచకా జరిగిపోయింది. ప్రతిఘటించింది. కాని పల్లెత్తు మాట కూడా అనలేదు. పెనుగులాడింది. కాని ఇతరుల్లా శాపనార్థాలు పెట్టలేదు. అందాల బొమ్మ కంట్లో నీరు కనపడగానే కోర్కెరెట్టింపైంది. తల బాదుకుంటూంటే ఉత్సాహం పొంగిపొర్లింది....

ఆమె సర్దుకునేవరకు కాస్సేపు ఊపిరి పీల్చుకుందామని బయటికొచ్చాడు. విజయగర్వంతో భుజాలెగరేసాడు.

"నమస్కారం డాక్టర్ బాబూ...." హీన సర్వం "వినిపించింది. గేటువైపుచూచాడు. ఒక ముదుసలి లోపలికికొస్తున్నాడు. పంచా, బనీను ధరించాడు. తలకు రుమాలు చుట్టుకున్నాడు.

"ఎవ్వరున్నవు?" గద్దించాడు.

వచ్చిన మనిషి ఎగాదిగా చూచి.

మీరు.... మీరు విష్ణు బాబుగారే కదూ? అనడిగాడు. కోపం వచ్చింది. కాని ఎందుకైనా మంచిదని తగ్గిపోయాడు.

" ఔను నాపేరు డాక్టర్ విష్ణువర్ధన్ ...నువ్వు ....నువ్వు" ఎక్కడో చూచినట్లు, మాట్లాడినట్లు అన్పించింది.

"నేను రామనాథాన్ని - మావూరు చింతమడక. లీలగా గుర్తుకొస్తుంది. ఇరవయ్యేళ్ళ క్రితం.......తాను కొత్తగా డాక్టర్ ఉద్యోగంలో చేరాడు. చింతమడక ప్రైమరీ హెల్త్ సెటంర్లో. అప్పటికింకా ఇ. యన్. టి. స్పెషలైజేషన్ పూర్తి కాకున్నా డాక్టరుగా మంచి పేరొచ్చింది. ప్రైవేటు ప్రాక్టీసు పెరిగింది. కొత్త కోర్కెలకు రెక్కలు రావడం ప్రారంభమయింది.

అందాల ఆడరోగిని చివరిగా పిలిచి, తనివిదీరా ఆవిడ అందాల్ని పరీక్షించాలనుకున్న మొదటి రోజు...

"నా కూతురు సువర్ణ మీకు గుర్తుందా బాబూ?" అతి వినయంగా ప్రశ్నించాడు రామనాథం.

"ఆ.... సువర్ణ కదూ ?"

"ఔను బాబు....! ఆరోజు.... బదిలీమీద పట్నానికొచ్చే ముందురోజు మీరామెను...." "రుమాలుగుడ్డ నోట్లో కుక్కుకున్నాడు" తనుగూడా ఆ సంఘటనను మర్చిపోలేడు.

"ఔనౌను. డబ్బుకూడా ఇచ్చానుకదూ .... సువర్ణ ఇప్పుడెక్కడుంది? ఎలాగుంది?" అడిగాడు చేతిగుడ్డలో చెమటను తుడుచుకుంటూ...

"మీ చలువవల్ల పెళ్ళికాకముందే ఒక ఆడపిల్లను భూమ్మీద పడేసి చనిపోయింది. నా కళ్ళముందే దానికి నూరేళ్ళు నిండాయి. తన కూతుర్ని నాకప్పగించి నా కూతురు మాయమైపోయింది బాబూ....!" పొంగుకొచ్చే దుఃఖాన్ని ఆపుకోలేక కన్నీళ్ళను రుమాలుతో తుడుచుకుంటున్నాడు.

విష్ణువర్ధన్ బుఱ్ఱ గిఱ్ఱుమంది. ఎందుకైనా మంచిదని విషయాన్నింకా సాగదీయ వద్దనుకున్నాడు. ఒంటిమీద కొరడాతో ఎవరో కొట్టినట్లనిపిస్తున్నా, చివరిపేషంటుకు అసలు పరీక్షచేద్దామని లేచాడు కుర్చీలోంచి. ఈలోగా ఆ పేషంటే బయటి కొచ్చింది కళ్ళు, ఒళ్ళు, తుడుచుకుంటూ, నేల చూపులు చూసుకుంటూ.

రామనాథం ఆపేషంటుని చూపిస్తూ.

ఈమె నే బాబూ మీ సువర్ణ కూతురు. భగవంతుడుకూడా నా మనుమరాలి కన్యాయం చేశాడు. పుట్టుమూగది. పద్దెనిమి దేళ్ళ వయస్సు వచ్చి లోకజ్ఞానం తెలిసినా, మాటమాత్రం రాలేదు. మీకు చూపించి వైద్యం చేయిద్దామని ఉదయమే తీసుకొచ్చాను. మీరు సాయంత్రం రమ్మన్నారు. అలాగే వచ్చాం. ఇంతకు ముందే బీడిలు కొనుక్కునేందుకు బయటికెళ్ళాను...

రామనాథ మేదేదో చెబుతున్నాడు. డాక్టర్ విష్ణువర్ధన్ మీద పిడుగుల వర్షం కురుస్తూనే ఉంది.

("కావ్యజ్యోతి" 7-3-1988)

